## క్లుప్తంగా

### ఆదిత్యుని సన్నిధిలో 'మొగలిరేకులు' సెల్వరాజ్


స్వామిసన్నిధిలో సెల్వరాజ్

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని టీవీ సీరియల్స్ నటుడు (మొగలి రేకులు ఫేం) సెల్వరాజ్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికార సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రథసప్తమి రాష్ట్ర పండుగగా చేయడం అద్భుత నిర్ణయమని..భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. భోగి పర్వదినాన స్వామివారిని దర్శించుకోవడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఉంగటి రమణ మూర్తి పాల్గొన్నారు.

### డాక్టరేట్ ప్రదానం

**జి.సిగడాం:** పాలఖండ్యాం గ్రామానికి చెందిన గర్లంకి శ్రీనువాసరావు మాస్టర్ తమిళ నాడుకు చెందిన గ్లోబల్ హోమం ప్యాస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. శ్రీనివాసరావు రాజాం పట్నంలో అరుణోదయ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి 20 ఏళ్లుగా పేద విద్యార్థులకు విద్య, వైద్యం, ఇతర రంగాల్లో చేయూత ఇచ్చి ఆదుకున్నారు. కళాశాలల్లో ఆంగ్లం అధ్యాపకునిగా స్వచ్ఛంద సేవలు చేశారు. ఈ సేవలను గుర్తించి వర్సిటీలో డాక్టరేట్‌ను అందించారు. ఆయన్ని పలువురు అభినందించారు.

### 31న వేదాంత శ్రవణం

**శ్రీకాకుళం కల్చరల్:** నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో ఈ నెల 31, ఫిబ్రవరి 1న నిర్వహించనున్న వేదాంత శ్రవణం, సంస్కార సుధ కార్యక్రమ పోస్టర్‌ను జగద్గురు శంకరాచార్య విధుశేఖర భారతి స్వామి సోమవారం ఆవిష్కరించారు. జగద్గురు ఆది శంకరాచార్య మహా సంస్థాన్ శారదా పీఠం శృంగేరి అహం బ్రహ్మాస్మి వారి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, ప్రవేశం ఉచితమని నిర్వాహకులు పెంట కార్తికేయ శర్మ తెలిపారు.

### క్రికెట్, ముగ్గుల పోటీలు


విజేతలతో నిర్వాహకులు

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల గ్రామంలో విశ్రాంత ఉద్యోగి జేవీఆర్ నాయుడు సంక్రాంతి సందర్భంగా సోమవారం క్రికెట్ టోర్నమెంట్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గ్రామ యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

### పేదలకు దుస్తుల పంపిణీ

**రణస్థలం:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలోని పలు పంచాయతీల వైఎస్సార్‌సీపీ నాయకులు పేదలకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. జె.ఆర్.పురం పంచాయతీలోని దన్నానపేటలో వైస్ సర్పంచ్ దన్నాన సీతారాం, తెప్పలవలస పంచాయతీలో సీతారాంపురం పంచాయతీలో స్థానిక నాయకుడు దన్నాన హరి దుస్తులు అందజేశారు.

### దవళపేటలో వస్త్రదానం

**జి.సిగడాం:** దవళపేట గ్రామంలో పి.వి.ఎస్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేడాడ రామ్మోహన రావు (ఇంజినీరు), డాక్టర్ సుజాత ఆర్థిక సాయంతో పాఠశాల ఆవరణలో పేదలకు సోమవారం వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం యువతీ, యువకులు ముందడుగు వేయాలని కోరారు. పేదలకు వస్త్రాదానం, గ్రంథాలయం , సరస్వతి విగ్రహం ఏర్పాటు చేసిన రామ్మోహ రావును గ్రామస్తులు అభినందించారు.

### వైఎస్సార్‌సీపీ పటిష్టానికి కృషి


సూర్యనారాయణ

**ఎచ్చెర్ల:** వైఎస్సార్‌సీపీ పటిష్టానికి తనవంతు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమితులైన బొంతు సూర్యనారాయణ అన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రణస్థలం సేవా సహకార సంఘం అధ్యక్షులుగా, మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సేవలందించిన తనకు జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

### భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు

**శ్రీకాకుళం కల్చరల్:** బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో పుష్య పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలగించారు.

# కల్యాణం.. కమనీయం..

- అంగరంగ వైభవంగా గోదారంగనాథుల కల్యాణం
- ముగిసిన ధనుర్మాస వ్రతాలు


పాత శ్రీకాకుళం కల్యాణ వెంకన్న ఆలయంలో..


నారాయణ తిరుమలలో గోదా రంగనాథుల కల్యాణం


పీఎన్‌కాలనీ వినాయక ఆలయంలో..


కోదండరామాలయంలో గోదాదేవి కల్యాణం


నారాయణ తిరుమలలో ఆకట్టుకున్న ముగ్గులు


గోదారంగనాథుల అలంకరణ


బ్యాంకర్స్‌కాలనీలోని శివబాలాజీ ఆలయంలో..


బలగ హరేరామ మందిరంలో..

**శ్రీకాకుళం కల్చరల్:** ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా నగరంలోని పలు ఆలయాలలో గోదా రంగనాథుల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నెల రోజుల పాటు నిర్వహించిన తిరుప్పావై ప్రవచనాలు ముగిశాయి. రోజుకొక పాశురాల పారాయణలతో ధనుర్మాస వ్రతాలను నిర్వహించిన భక్తులు గోదా రంగనాథుల విగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో అర్చకులు బి.శేషాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మనాభాచార్యులు, భక్తబృందం పాల్గొన్నారు.
- చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణం జరిపించారు. ఈఓ మాధవి స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. గీతాసంత్సంగం భక్తులు పాల్గొన్నారు.
- బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో అర్చకులు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించారు. బలగలోని హరేరామ మందిరంలో అర్చకులు చెరువు నారాయణరావు అర్చకత్వంలో గోదా రంగనాథుల కల్యాణ వేడుకలు సంప్రదాయంగా నిర్వహించారు.
- పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు బూరాడ వంశీకృష్ణమాచార్యులు అర్చకత్వంలో కమిటీ సభ్యులు ఎల్. నందికేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, యోగేశ్వరరావుల ఆధ్వర్యంలో గోదారంగనాథుల కల్యాణం ఘనంగా జరిగింది.
- పీఎస్ కాలనీలోని సిద్ధిబుద్ధి సహిత వరసిద్ధి వినాయక పంచాయతన ఆలయంలో ఆలయ ధర్మకర్త పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో గోదా రంగునాథుల కల్యాణోత్సవం నిర్వహించారు.
- పీఎస్ కాలనీలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు నేతృత్వంలో గోదారంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళం సభ్యులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### వస్త్రదానం



నగరంలోని బొంతావారివీధి కృష్ణార్జున మందిరంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం పేదలకు వస్త్రాలు దానం చేశారు. కమిటీ సభ్యులు గరిమెళ్ల విజయకుమార్, లయం అరుణకుమార్, మరికొందరు కలిసి చీరలు, తువ్వాళ్లు, లుంగీలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిమిక్రీ శ్రీనివాస్, అంధవరపు మురికయ్య తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

### ముగిసిన మేలుకొలుపులు



బలగ హరేరామ మందిరం భజన బృందం ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న మేలుకొలుపులు కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు హరేరామ మందిరం వద్ద ప్రత్యేకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. – శ్రీకాకుళం కల్చరల్

### సంక్రాంతి శోభ



సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇప్పిలి వీధిలో ఓ నివాసంలో సంప్రదాయ అలంకరణ ఏర్పాటు చేశారు. సంక్రాంతి ముగ్గు, చెరుకుగడ, గాలిపటం తదితర సామగ్రితో పండగ ఉట్టిపడేలా అలంకరణ చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల పోలీసులు ఆటోల్లో గ్రామాల్లో విస్తృతంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ప్రచారం చేశారు. కోళ్ల పందేలు, పేకాట, ఇతర గ్యాబ్లింగ్ ఆటలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


బొంతలకోడూరులో ప్రచారం చేస్తున్న పోలీసులు

# భోగ భాగ్యాల భోగి


శ్రీకాకుళం నగరంలో భోగి మంటలు


శ్రీకాకుళంలో భోగి మంట వద్ద సందడి


నగరంలో భోగి మంట


శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి పెద్దమందిరం వద్ద భోగి మంటలు


గార: కె.మత్స్యలేశంలో భోగి మంట వద్ద మహిళల డ్యాన్స్


జి.సిగడాంలో భోగి మంట


ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో భోగి మంటలు

**శ్రీకాకుళం కల్చరల్:** తెలుగింటి ముంగిట భోగి మంటలు వెలుగులీనాయి. మూడు రోజుల వేడుకల్లో భాగంగా మొదటిగా భోగి పండగను సోమవారం ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రజలు భోగి మంటలు వెలిగించారు. ఈ సందర్భంగా పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి సందడి చేశారు. పాలకొండ రోడ్డులోని సత్యసాయి మందిరం వద్ద భోగి వేడుకలను సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు ప్రారంభించారు. పండగ విశిష్టతను వివరించి, వివిధ పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పెద్దమందిరం కన్వీనర్ కంబ మురళీకృష్ణ, జోనల్ కన్వీనర్ శివన్నారాయణ, మెట్ట నాగభూషణం, గుడ్ల భానుమూర్తి, సర్వేశ్వరరావు, అప్పారావు, అనురాధ, పుణ్యవతి పాల్గొన్నారు.

- **గార:** మండలంలోని కళింగపట్నం- మత్స్యలేశంలో సోమవారం సంక్రాంతి సంబరాలు సందడిగా ప్రారంభమయ్యాయి. జగనన్న న్యూ కాలనీలోని రీక్రియేషన్ గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. భోగి మంటల వద్ద మహిళల నృత్యం, చిన్నారుల ఫ్యాషన్ షో, ఫన్ గేమ్స్, మ్యూజికల్ చైర్ కార్యక్రమాలు అలరించాయి. సంక్రాంతి నాడు రంగవల్లి ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు, సంప్రదాయ దుస్తుల ఫ్యాషన్ షో జరగనున్నాయి. సర్పంచ్ బి.లలిత, యువత పాల్గొన్నారు.

### పాడి పరిశ్రమల అభివృద్ధే లక్ష్యం

**గార:** పాడిపరిశ్రమ అభివృద్ధే గోకులం నిర్మాణాల లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకూర్మం పంచాయతీ అయ్యవారిపేటలో ఏర్పాటు చేసిన గోకులాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం నాడు పాడి, పంటల అభివృద్ధి కోసం చేసే మంచి కార్యక్రమం గోకులమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా యువజన దినోత్సవం


విద్యార్థులను బంగారు పతకాలను సత్కరిస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం కల్చరల్:** నగరంలో సోమవారం జీఈవో, గ్లోబల్ ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకులం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జీఈఓ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 40 మంది పేద విద్యార్థులను చదివించడం, నిత్యావసర సరుకులు, రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, అవగాహనా కార్యక్రమాలు చేపట్టం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, జీఈవో సంస్థ ప్రతినిధి సద్గుణ, సభ్యులు స్వరూప్, సంతోషిణి, సౌజన్య, ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగిన క్రీడా స్ఫూర్తి

- పాత, కొత్త తరం క్రికెటర్లతో మ్యాచ్ నిర్వహణ
- 25 ఏళ్ల ఆనవాయితీని కొనసాగించిన జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు


ఇలియాస్ మహ్మద్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నిస్తున్న ఆర్వీరెడ్డి


మ్యాచ్‌కు హాజరైన జిల్లా క్రికెట్ సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రికెటర్లు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జిల్లా క్రికెటర్లలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకే పాతతరం , కొత్తతరం క్రికెటర్ల మేలి కలయికతో ప్రతి ఏడాది భోగి రోజున ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహిస్తున్నామని జిల్లా క్రికెట్ సంఘ మెంటార్ ఇలియాస్ మహ్మద్, మాజీ క్రికెటర్లు వండాన మురళి, వీవీఆర్ఎస్ మూర్తి పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానంలో సోమవారం భోగి సందర్భంగా 25 ఏళ్ల ఆనవాయితీని కొనసాగిస్తూ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. జిల్లా క్రికెట్ సంఘ పూర్వ కార్యదర్శి ఓ.కమలాకర్ ఆరంభించిన ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ సంస్కృతిని ఈ ఏడాది కూడా కొనసాగించారు. ముందుగా దివంగత క్రికెటర్లు డాక్టర్ జీవీ రాజారెడ్డి, మీర్ మహ్మద్, ఒరుగంటి కమలాకర్, బత్తుల రమణ, ఇషాక్ మహ్మద్, టీఎంఎస్ ప్రకాష్, వైవీఆర్ మూర్తి, అలియాస్ ముని, వీనస్‌హోటల్ అధినేత హరికేశవ, ధర్మరాజు తదితరులకు నివాళులు అర్పించారు. అనంతరం సెక్రటరీ లెవన్, ప్రెసిడెంట్స్ లెవన్ రెండు జట్లు తలపడగా.. సెక్రటరీ లెవన్ గెలిపొందింది. ఈ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ సంఘ మెంటార్ ఇలియాస్ మహ్మద్ నేతృత్వంలో డీఎస్పీ కుమారస్వామి, సీఐ బుచ్చిరాజు, సీనియర్ క్రికెటర్లు వండాన మురళిమోహన్, డాక్టర్ సువ్వారి రవికుమార్, కోశాధికారి మదీనాశైలానీ, భద్రగిరి మురళీధర్‌కుమార్, ఎం మురేన్‌హక్, నంబాళ్ల విద్యారమ్య చక్రవర్తి, ఆర్వీ రెడ్డి, ప్రవీణ్, వెనిగళ్ల మధుసూదన్, చన్న రఫీ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, భద్రగిరి శ్రీరామ్, ప్రిన్సిపాల్ మనోహర్, ఎ.రామ్మోహన్, సీహెచ్ విజయభాస్కర్, అడప మోహన్, వీవీఆర్ ఎస్ మూర్తి, మీర్ హైదర్, అసిస్టెంట్ కోచ్ అన్నెపు ఆనంద్‌రాజు, ట్రైనర్ రాజా, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### క్రికెటర్లను ప్రోత్సహించేందుకే..

జిల్లా అందరి సహకారంతో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. గత సీజన్‌లో జిల్లా నుంచి రంజీ క్రికెటర్లతో కలిపి మొత్తం 9 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఏసీఏ ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఈ సీజన్‌లోను ఐపీఎల్‌కు త్రిపురాన విజయ్‌తో కలిపి 10 మంది వివిధ రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించారు. క్రికెటర్లను ప్రోత్సహించేందుకు 25 ఏళ్లుగా ఆనవాయితీ కొనసాగిస్తున్నాం.

– ఇలియాస్ మహ్మద్, జిల్లా క్రికెట్ సంఘం మెంటార్

## నాటిక పోటీల్లో 'మెట్ట' సోదరులకు అవార్డులు


కొత్తపరిమళం నాటికలో ఓ సన్నివేశం

**శ్రీకాకుళం కల్చరల్:** రాయుడుకుదురులోని శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ రాష్ట్ర స్థాయి నాటిక పోటీలలో జిల్లాకు చెందిన మెట్ట పోలినాయుడు, మెట్ట రాజులకు ఉత్తమ అవార్డులు దక్కాయి. బి.ఎం.ఎస్.పట్నాయిక్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'కొత్తపరిమళం' నాటిక పోటీలో ఉత్తమ నటుడిగా పోలినాయుడు, ఉత్తమ విలన్‌గా రాజుకు అవార్డులు వచ్చాయి. వీరిద్దరూ ఎచ్చెర్ల మండలం సనపలనాయుడుపేటకు చెందిన రంగస్థల, సినీ నటుడు దివంగత మెట్ట అప్పారావునాయుడు కుమారులు. పోలినాయుడు వృత్తిరీత్యా పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్ కాగా, వెంకటరాజు జ్యుడీషియల్ విభాగంలో ఉద్యోగి. వీరిద్దరూ ఇప్పటికే అనేక అవార్డులు అందుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**శ్రీకాకుళం రూరల్:** పెదపాడు రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార మండలం కొమరివానిపేటకు చెందిన మురమండ రాజు గాయపడ్డాడు. రాజు బైక్‌పై శ్రీకాకుళం వస్తుండగా నరసన్నపేట నుంచి శ్రీకాకుళంలోకి వస్తున్న మహేంద్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజు తలకు తీవ్ర గాయాలు కావడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.